క్లుప్తంగా

మాట ప్రకారం పింఛను పెంచిన ఘనత సీఎం జగన్‌దే



నగరంపాలెం: మాట ప్రకారం విడతలు వారీగా రూ.3 వేలకు పింఛను పెంచిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ అన్నారు. వైఎస్ఆర్ సామాజిక పెన్షన్లను గురువారం ఆర్.అగ్రహారం 58, 59వ సచివాలయాల పరిధిలో ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ నూనె కిషోర్, గృహసారథులు నాగసుధీర్, రమణస్వామి, వసంత్‌రాజు, రాజబాబు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



గుంటూరు మెడికల్: నిత్యం రోగుల సేవల్లో ఆసుపత్రుల్లో ఉండే వైద్యులు అప్పుడప్పుడు క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసం పొందుతారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఆవుల శ్రీనివాస్ అన్నారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, సెక్రటరీ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డిల ఆధ్వర్యంలో స్థానిక అమరావతి రోడ్డులోని కేఎస్ఆర్ కాంటినం క్రీడా ప్రాంగణంలో నాలుగోరోజు జరిగిన షటిల్ క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో గెలుపొందిన వారికి గురువారం డాక్టర్ ధనుంజయరావు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైద్యుల్లో అంతర్లీనంగా ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఐఎంఏ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజులపాటు జరుగనున్న ఫైనల్స్ సెమీఫైనల్స్‌లో పాల్గొనేందుకు డాక్టర్లందరూ చాలా ఉత్సాహంగా ఉన్నారని వెల్లడించారు. స్పోర్ట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ జాన్ షాహిద్, డాక్టర్ అస్లాం, డాక్టర్ సందీప్, డాక్టర్ ప్రదీప్, పలువురు డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు స్థిరాస్తి హక్కు చట్టంపై రౌండ్ టేబుల్ సమావేశం

గుంటూరు మెడికల్: రాజ్యాంగ చర్చా వేదిక ఆధ్వర్యంలో స్థిరాస్తి హక్కు చట్టం వరమా? శాపమా? అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు నడింపల్లి గురుదత్, అవధానుల హరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తేదీ ఉదయం 10 గంటలకు బ్రాడీపేట రెండోలైన్‌లోని బాలానంద కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎం.వి.రాజారామ్ ప్రధాన వక్తగా పాల్గొంటారని పేర్కొన్నారు. వివిధ రంగాల నిపుణులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని జాయింట్ సెక్రటరీ డాక్టర్ టి.సేవకుమార్ కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నెహ్రూనగర్: ఎన్విరాన్మెంట్ సెక్రటరీ ఉద్యోగుల సమస్యలను పరిష్కారించాలని గ్రామ/వార్డు సచివాలయం ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు సీడీఎంఏ కోటేశ్వరరావును గురువారం తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వార్డు సచివాలయం ఎన్విరాన్మెంట్ సెక్రటరీల రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బండారు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్విరాన్మెంట్ సెక్రటరీల టైమింగ్ మార్పు, సర్వీసెస్, ప్రమోషన్ ఛానల్ అంశాలపై సీడీఎంఏకు విన్నవించామన్నారు. ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీల ప్రతినిధులు కె.బుల్లియ్య, మాధవరావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణమండపంలో బ్యాగు చోరీ

గుంటూరు ఈస్ట్: కల్యాణ మండపంలో బంగారు గొలుసు ఉన్న బ్యాగు చోరీ జరిగిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్ధార్థ గార్డెన్స్ కల్యాణ మండపంలో బుధవారం వివాహం జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి వివాహ వేదికపై వంద గ్రాముల బంగారు గొలుసు ఉన్న బ్యాగును చోరీ చేశాడు. ఈఘటనపై డాక్టర్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

గుంటూరు మెడికల్: నిత్యం రోగుల సేవల్లో ఆసుపత్రుల్లో ఉండే వైద్యులు అప్పుడప్పుడు క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసం పొందుతారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఆవుల శ్రీనివాస్ అన్నారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, సెక్రటరీ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డిల ఆధ్వర్యంలో స్థానిక అమరావతి రోడ్డులోని కేఎస్ఆర్ కాంటినం క్రీడా ప్రాంగణంలో నాలుగోరోజు జరిగిన షటిల్ క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో గెలుపొందిన వారికి గురువారం డాక్టర్ ధనుంజయరావు బహుమతులను ప్రదానం చేశారు. స్పోర్ట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ జాన్ షాహిద్, డాక్టర్ అస్లాం, డాక్టర్ సందీప్, డాక్టర్ ప్రదీప్, పలువురు డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పింఛన్ కానుకతో అవ్వా తాతలకు భరోసా

- శాసనసభ్యులు కిలారి వెంకట రోశయ్య
- చేబ్రోలులో వైఎస్సార్ పెన్షన్ కానుక మూడు వేలు పంపిణీ

చేబ్రోలు: అవ్వా తాతలకు వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పిస్తున్నారని శాసనసభ్యులు కిలారి వెంకట రోశయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వైఎస్సార్ పెన్షన్ కానుక మూడు వేలు పెంపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా 114 మంది నూతన లబ్ధిదారులకు పెన్షన్లను అందజేశారు. సమావేశానికి ఎంపీడీవో బి.బాబురావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చినట్లు తెలిపారు. దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఏపీలో అమలు జరుగుతున్న రైతు భరోసా కేంద్రాలు, విద్యా రంగంలోని మార్పులు ఆదర్శంగా నిలిచాయన్నారు. పేద, మధ్య తరగతి ప్రజానీకం ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. గత ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో వివక్షత చూపిందన్నారు. గత ప్రభుత్వ పాలనకు ప్రస్తుతం పనిచేస్తున్న జగనన్న ప్రభుత్వానికి వ్యత్యాసాన్ని గమనించాలన్నారు.

పరిపాలన వ్యవస్థలో పెనుమార్పులు తీసుకువచ్చి ప్రభుత్వ సేవలు గడప వద్దకే తీసుకువచ్చినట్లు తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో 39 లక్షల పెన్షన్ దారులుండగా ప్రస్తుతం 66.5 లక్షల మందికి పెన్షన్ కానుక ద్వారా రూ.85 వేల కోట్లు అవ్వాతాతలకు అందించినట్లు తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, పారదర్శకంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. రానున్న కాలంలో జగనన్నకు అండగా ఉండాలన్నారు. వివిధ గ్రామాలకు చెందిన నూతన పెన్షన్‌దారులకు మూడు వేల రూపాయల పెన్షన్ నగదును అందజేసి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొక్కిలగడ్డ సాహితి, తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, పాలడుగు వెంకటేశ్వరరావు, చుక్కా నాగబాబు, ముత్తేశ్వరరావు, చౌడయ్య, రాఘవ, విజయ కుమార్, పెదమస్తాన్, శ్రీరెడ్డి, కిరణ్, పుల్లారెడ్డి పాల్గొన్నారు.



చేబ్రోలులో లబ్ధిదారులకు పెన్షన్ కానుక అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

జగనన్న చెప్పారంటే.. అమలు చేస్తారంతే

వైఎస్సార్ సీపీ నియోజక వర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్

కాకుమాను: ముఖ్యమంత్రి జగనన్న హామీ ఇచ్చారంటే.. అమలు చేసి చూపెడతారని వైఎస్సార్ సీపీ నియోజక వర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ స్పష్టం చేశారు. మండల కేంద్రం గ్రామ సచివాలయం-2లో గురువారం వైఎస్సార్ పెన్షన్ కానుక (తంఛన్‌గా పెన్షన్) కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో రాజకీయ పార్టీలు స్వార్థాల కోసం, తమ ఉనికిని కాపాడుకోవడం కోసం పనిచేస్తున్నాయని వివరించారు. బలసాని కిరణ్ కుమార్ మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను, వాగ్దానాలను నూరు శాతం అమలు చేసిన ఏకైక నాయకుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. గత ప్రభుత్వంలో పింఛన్ కావాలన్నా, తీసుకోవాలన్నా, ఏ ప్రభుత్వ పథకాలను పొందాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగడంతో పాటు కొద్దో, గొప్పో నగదు సమర్పించుకోవల్సి ఉండేదని ఆయన తెలిపారు. ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ, రైతులకు, ప్రజలకు సకాలంలో సక్రమంగా అందించాలనే దృఢ సంకల్పంతో ప్రతి గ్రామంలో కొన్ని కోట్లు ఖర్చు చేసి గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు గ్రామ వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

101 మందికి నూతన పింఛన్‌లు

డిసెంబర్ నెలలో కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న 101 మందికి ఒక్కొక్కరికీ రూ.3 వేల రూపాయల నూతన పింఛన్లను పంపిణీ చేశారు. గత ప్రభుత్వంలో మండలంలో 4172 మందికి మాత్రమే పింఛన్ పంపిణీ చేశారని అది కూడా అరకొరగా పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలు చూడకుండా ఏకంగా 6,917 మందికి పింఛన్‌లు మంజూరు చేయడంతో పాటు ఆరు నెలలకొకసారి సుమారు వంద నుంచి 150 మందికి కొత్త పింఛన్‌లు మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ పసుపులేటి శివపార్వతి, మండల ఉపాధ్యక్షులు పెదపూడి కపిల్, కాకుమాను-2 ఎంపీటీసీ కానుగుల పరమేశ్వరరావు, మండల ప్రత్యేకాధికారిణి తేళ్ల ప్రేమ కుమారి, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, కాకుమాను సొసైటీ అధ్యక్షుడు కాంద్రు అప్పారావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పింఛన్‌దారులు పాల్గొన్నారు.



పొన్నూరులో సమావేశానికి హాజరైన లబ్ధిదారులు, పార్టీ శ్రేణులు



హాజరైన పింఛన్ లబ్ధిదారులు



పింఛన్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి

జగనన్న అంటే.. అభివృద్ధి సంక్షేమం

గుంటూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం అభివృద్ధి రెండు కళ్లుగా పని చేస్తున్నారని 40వ డివిజన్ కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి తెలిపారు. గురువారం డివిజన్ పరిధిలోని పెదపలకలూరు గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి అవ్వాతాతకు జగనన్న పెద్దకొడుకయ్యాడన్నారు. ఎన్నికల హామీలలో చెప్పిన విధంగా పింఛన్లు రూ.3వేలకు పెంచి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పిల్లి నాగేశ్వరరావు, కందుల వెంకటేశ్వర రెడ్డి, జాని, షేక్ బుజ్జి, సాధిక్, అనిల్, ముత్యాల శ్రీను, జనార్దన్, గ్రామంలోని పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్య భరోసా

గుంటూరు రూరల్: ప్రజల ఆరోగ్యానికి భరోసా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అని 26వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి తెలిపారు. గురువారం డివిజన్ పరిధిలోని పొత్తూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని కాపాడుతూ కార్పొరేట్ వైద్యం అందించేందుకు జగనన్న ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా స్పెషలిస్ట్ వైద్యులతో వైద్య చికిత్సలు అందించటం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ సమీర, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ కిరణ్, శ్యామల బ్రహ్మారెడ్డి, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

డిజైన్ థింకింగ్‌పై వర్క్‌షాప్

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐడియా ల్యాబ్స్ ఆధ్వర్యంలో గురువారం సీఎస్ఈ-డీఎస్ విభాగం విద్యార్థులకు డిజైన్ థింకింగ్‌పై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐడియా ల్యాబ్స్ సీఈవో పంకజ్ దివాన్, అమెజాన్ డిజైన్ థికింగ్ అనలిస్ట్ శ్రీకాంత్‌లు హాజరయ్యారు. డిజైన్ థింకింగ్‌లో మైండ్ మ్యాపింగ్ టెక్నిక్స్‌పై అవగాహన కల్పించారు. మలినేని ఇంజినీరింగ్ కళాశాలల చైర్మన్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ విద్యార్థులు ఇన్నోవేటివ్ వర్క్‌షాప్‌లను సద్వినియోగం చేసుకుని కెరీర్‌ను మెరుగు పరుచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జెట్టి అప్పారావు, డీఎస్ హెచ్‌వోడీ హరికృష్ణ, డీన్ రమేష్ పాల్గొన్నారు.

7న ఆరోగ్య సభ

లక్ష్మీపురం: అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 7న జీర్ణకోశ సంబంధిత వ్యాధులు, గ్యాస్ట్రిక్ సమస్యలపై ఆరోగ్య సభ నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అరండల్ పేటలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించే ఆరోగ్య సభలో శ్రావణి హాస్పిటల్ అధినేత, ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ పోసాని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య సలహాలు, సూచనలు అందజేస్తారని పేర్కొన్నారు.

మార్చి వరకు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు

గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరియునిస్

ప్రత్తిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు మండలంలో మార్చి 26వ తేదీ వరకు జరగనున్నాయని గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మేరియునిస్, ప్రత్తిపాడు కోలొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దివ్యమేఘనలు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 9న కోయవారిపాలెంలో, 19న ప్రత్తిపాడు-బీలో, 23న ప్రత్తిపాడు-1లో, 30న తిక్కిరెడ్డిపాలెంలో, ఫిబ్రవరి 6వ తేదీన ప్రత్తిపాడు-ఏ సచివాలయం పరిధిలో, 13న వంగిపురంలో, 20న గొట్టిపాడు-1, గనికపూడి గ్రామాల్లో, 27న నడింపాలెం-2లో, మార్చి 12న యనమదలలో, 19న నడింపాలెం-1లో, 26న తుమ్మలపాలెంలో క్యాంపులు జరగనున్నట్లు చెప్పారు. గొట్టిపాడు పీహెచ్‌సీ ఒక టీంగా, ప్రత్తిపాడు పీహెచ్‌సీ రెండవ టీంగా ఏర్పడి గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు. ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం క్యాంపుల్లో అందుబాటులో ఉండి రోగులకు వైద్యసేవలు అందిస్తారని చెప్పారు.

గ్రామాల్లో డోర్ టు డోర్ సర్వే..

క్యాంపు జరిగే తేదీకి 15 రోజుల ముందు నుంచి సంబంధిత గ్రామాల్లో ముందస్తుగా ఆరోగ్య సిబ్బంది సర్వే నిర్వహిస్తారని వెల్లడించారు. ఇప్పటికే కోయవారిపాలెంలో ఈ సర్వే ప్రారంభించామని, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేస్తున్నారని వివరించారు. కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలు, పరిస్థితిని తెలుసుకుని, బీపీ, షుగర్, హెచ్‌బీ పరీక్షలు చేస్తారని, తీవ్ర సమస్యలున్న వారిని గుర్తించి వారు శిబిరాలకు హాజరయ్యేలా చూస్తారని చెప్పారు. అనంతరం వైద్యులు పరీక్షించి, అవసరమైతే వ్యాధి తీవ్రతను బట్టి ఏడు రకాల పరీక్షలు అక్కడికక్కడే నిర్వహిస్తారని ఆమె చెప్పారు. సర్వేకు ప్రజలు సహకరించాలని మేరియునిస్ కోరారు. అదేవిధంగా సిబ్బంది కూడా ఎలాంటి అలసత్వం లేకుండా సర్వే చేయాలని ఆదేశించారు.



సురక్ష సర్వేలో భాగంగా ఇంటింటికీ వెళ్లి వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

జగనన్నే మా నమ్మకం

గుంటూరు ఎడ్యుకేషన్: పశ్చిమ నియోజకవర్గంలోని 25వ డివిజన్ కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి ఆధ్వర్యంలో గురువారం లక్ష్మీ నగర్‌లో 'బాబూ ఆపు నీ నాటకం-జగనన్నే మా నమ్మకం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 79వ సచివాలయ కన్వీనర్ నాగలక్ష్మి, క్లస్టర్-20 గృహ సారథులు గడప, గడపకు వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వృద్ధులకు ప్రభుత్వం పెంచిన పెన్షన్ రూ.3వేలు నగదును పంపిణీ చేశారు. నవరత్నాల ప్రగతి పత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి శివరావుకు సేవా స్ఫూర్తి అవార్డు

నగరంపాలెం: వీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ (హైదరాబాద్) 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సేవా స్ఫూర్తి అవార్డుని ప్రకటించినట్లు విశ్రాంత ఉద్యోగి పలకలూరి శివరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న హైదరాబాద్ తిలక్ రోడ్‌లోని తెలంగాణ సరస్వత్ పరిషత్ భవనంలో అవార్డు ప్రదానం చేయనున్నారని ఆయన పేర్కొన్నారు. శివరావుకి అవార్డు ప్రకటించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పంచాయతీ కార్యదర్శిపై ఎంపీడీవోకు ఫిర్యాదు

ప్రత్తిపాడు: స్థానిక పంచాయతీ కార్యదర్శి జాన్‌పీరా కత్తితో పొడిచి తనను చంపుతానని బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ మాజీ సొసైటీ అధ్యక్షుడు కమ్మా శివప్రసాద్ సెక్రటరీపై ఎంపీడీవోకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవోను కలిసిన ఆయన తమ సమస్యను వివరించారు. గత నెల 30వ తేదీన కార్యదర్శి మీడియా సమావేశం నిర్వహించి పంచాయతీ అనుమతుల్లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే వాటిని తొలగించి కేసులు నమోదు చేస్తామని తెలిపారన్నారు. ఇదే విషయమై అదేరోజు సాయంత్రం మాట్లాడేందుకు పంచాయతీ కార్యాలయానికి వెళ్లానన్నారు. అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడుతున్న సమయంలో ఒక్కసారిగా సెక్రటరీ నన్ను రెచ్చగొట్టేలా దుర్భాషలాడుతూ కత్తితో పొడుస్తా, చూసుకుందాం రా.. అంటూ భయభ్రాంతులకు గురి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై విచారించి సెక్రటరీపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఏ. శ్రీరమ్యకు ఫిర్యాదు చేశారు. సానుకూలంగా స్పందించిన ఎంపీడీవో విచారిస్తామని తెలిపారు. ఇదే విషయాన్ని రాతపూర్వకంగా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామని శివప్రసాద్ వివరించారు.



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న శివప్రసాద్

ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక వార్డులు

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్)ను పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. గురువారం ఆసుపత్రి శుశ్రుత హాలులో వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ఈహెచ్ఎస్ అమలు తీరుపై ఆయన సమీక్ష చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో నిష్ణాతులైన వైద్యులు ఉన్నారన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా సదుపాయాలను కల్పిస్తుందని తెలిపారు. స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో ఉన్నారని, అనుభవం ఉన్న వైద్యులు ఉండటం వల్ల ప్రభుత్వ ఉద్యోగులు జీజీహెచ్‌లో వైద్యం కోసం ఇష్టపడుతున్నారని వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు ప్రత్యేక రూమ్‌లను కేటాయిస్తామని చెప్పారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ చీకటి విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల వైద్యపరమైన సమస్యలు పరిష్కరిస్తామని, విశ్రాంత ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తానని తెలిపారు. డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డీఎస్ఎస్ శ్రీనివాస్ ప్రసాద్, మానసిక వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్లాది వెంకట కిరణ్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, ఆరోగ్య శ్రీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ పాల్గొన్నారు.

శరణాలయంలో బాలలకు అన్నదానం



తాడేపల్లిరూరల్: మంగళగిరి రూరల్ పరిధిలోని చిన కాకాని షైన్ ఆనంద శరణాలయంలో బాలలకు గురువారం అన్నదానం నిర్వహించారు. శరణాలయం నిర్వాహకులు సంధ్యారాణి మాట్లాడుతూ మంగళగిరిలోని ప్రథమ ఎంబీబీఎస్ వైద్యులు డాక్టర్ అట్లూరి గోపాలకృష్ణమూర్తి ధర్మపత్ని అట్లూరి జయలక్ష్మి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆమె కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శరణాయలంలో బాలలకు అన్నదానం జరిగిందని వివరించారు.

కార్యక్రమంలో డాక్టర్ అన్నే సూర్యాజీరావు, డాక్టర్ ఆలూరి ప్రసాద్, డాక్టర్ గోలి రామ్మోహనరావు, నిమ్మగడ్డ దినకర్, అన్నే వివేకానంద, అట్లూరి బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదుకున్న బజరంగ్ ఫౌండేషన్

త్రీచక్ర బండ్లు అందజేత

నగరంపాలెం: బజరంగ్ ఫౌండేషన్ ఇద్దరు దివ్యాంగులను ఆదుకుంది. వారి రాకపోకలు సాగించేందుకు రెండు త్రిచక్ర బండ్లను అందించారు. దివ్యాంగులైన ములుకుదురు గ్రామంలోని వేరుచెర్ల ఆదిశేషు, మాచవరం గ్రామవాసి తలతోటి శ్యాంసన్ నడవలేని పరిస్థితి. శ్యాంసన్ ఓ దర్జీ వద్ద గుండీలు కుట్టి జీవనం సాగించే వాడు. అతడిని ఇంటి నుంచి దుకాణానికి తీసుకు రావాలన్నా ఎవరైనా సహాయం చేయాల్సిందే.. ఇక ఆదిశేషు కదల్లేని స్థితిలో ఇంటి వద్దనే ఉండేవాడు. నిరుపేదలైన వీరిద్దరి గాధను బజరంగ్ ఫౌండేషన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ, బృంద సభ్యులు ములుకుదురు, మాచవరం గ్రామాలకు గురువారం వెళ్లారు. కదల్లేని ఆ ఇద్దరి దివ్యాంగులకు దివ్యాంగ దర్శినిలో భాగంగా త్రీచక్రాల బండ్లను అందజేశారు. తమ జీవనాధారానికి అవసరమైన త్రీచక్రాల బండ్లను అందజేసిన అంబటి మురళీకృష్ణకు ఆ రెండు కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపారు.




శ్యాంసన్‌కు త్రీచక్ర బండిని అందించిన అంబటి మురళీకృష్ణ

జీవితంలో ఎదిగేందుకు చదువు ఒక్కటే మార్గం

డీఈఓ పి.శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆడ పిల్లలు, మహిళలకు జీవితంలో ఎదిగేందుకు చదువు ఒక్కటే ఏకైక మార్గమని డీఈఓ పి. శైలజ పేర్కొన్నారు. గురువారం బ్రాడీపేటలోని శ్రీ శారదానికేతన్ ఓరియంటల్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ పట్టాభిపురం, వాసవి క్లబ్ గుంటూరు ఆధ్వర్యంలో విద్యార్థినులు కూర్చునేందుకు బల్లలు, ఆఫీస్ ఫర్నీచర్ అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈఓ శైలజ మాట్లాడుతూ ఎవరికైనా చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, ముఖ్యంగా బాలికలకు విద్య ఎంతో అవసరమన్నారు. ఎవరైతే తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో మెలగుతారో వారు జీవితంలో ఖచ్చితంగా ఉన్నతస్థాయికి చేరుకుంటారని చెప్పారు. సెల్‌ఫోన్లు, సోషల్ మీడియాకు అలవాటు పడి జీవితాలను నాశం చేసుకోవద్దని సూచించారు. ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకుని చదువుతో పాటు కళల్లో రాణించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎ.సుధాకరరెడ్డి, మూల్పూరి ఉపేంద్ర, సీహెచ్ కృష్ణంరాజు, ఎం.శ్రీనివాసరావు, వాసవిక్లబ్ ప్రతినిధులు కె. వెంకట నగేష్, పీవీ శివనాగ ఆంజనేయులు, గ్రంధి శ్రీనివాస్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ శైలజ

అందుబాటులో అన్ని రకాల పుస్తకాలు

గ్రంథాలయ తనిఖీలో జేసీ జి.రాజకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రంథాలయాల్లో పాఠకులు కోరిన గ్రంథాలను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. గురువారం బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాలల శాఖ గ్రంథాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలో గ్రూప్-1, 2తో పాటు వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు కావాల్సిన పుస్తకాలు, మెటీరియల్స్ పై ఆరా తీశారు. వాటిని అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. సదుపాయాలను పాఠకులను అడిగి తెలుసుకున్నారు. రెగ్యులర్‌గా గ్రంథాలయానికి వస్తూ, అవసరమైన పుస్తకాలను కోరినట్లయితే వాటిని సరఫరా చేస్తామని జేసీ చెప్పారు. విద్యార్థులు, గృహిణులు, పోటీ పరీక్షల శిక్షణార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట గ్రంథ పాలకులు శకుంతల, సత్య శిరీష ఉన్నారు.



పాఠకులతో మాట్లాడుతున్న జేసీ రాజకుమారి

సచివాలయానికి తాగునీటి ప్యూరీఫైర్

మేడికొండూరు: డోకిపర్రు గ్రామంలో ఇటీవల కొత్తగా సచివాలయం ప్రారంభించారు. గ్రామ ప్రజలకు, సచివాలయ సిబ్బంది సౌకర్యార్థం సచివాలయంలో రూ. 20వేలు ఖరీదు చేసే మంచినీటి ప్యూరీఫైర్‌ని గ్రామ ఉపసర్పంచ్ షేక్ జానీబాషా గురువారం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కందుల సిద్దయ్య, గ్రామ సర్పంచ్ కొండెపోగు సాంబ్రాజ్యం, పంచాయతీ సెక్రటరీ బి.రమేష్, విద్యా కమిటీ చైర్మన్ ఉడతా ప్రభాకర్, దివ్య, శరవాణి, యెలిషాబాబు, పలువురు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

6,7 తేదీల్లో పౌరాణిక కళాకారుల సంక్షేమ సంఘం వార్షికోత్సవం

పాత గుంటూరు: పౌరాణిక కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘం 27వ వార్షికోత్సవం పురస్కరించుకుని గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈనెల 6, 7 తేదీలలో పౌరాణిక పద్య నాటకాలు ప్రదర్శించనున్నట్లు సంఘం అధ్యక్షుడు నలక శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం విజ్ఞాన మందిరంలో కార్యక్రమాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండురోజులపాటు రామాంజనేయ యుద్ధం, భవాని శీను, శ్రీ కృష్ణ రాయబారం, బాల నాగమ్మ, గయోపాఖ్యానం, సత్యహరిశ్చంద్ర వంటి అనేక పౌరాణిక పద్యనాటకాల ప్రదర్శనలు జరుగుతాయని పేర్కొన్నారు. కళాకారులు, నాటకాభిమానులు పాల్గొని ప్రదర్శనలు వీక్షించాలని కోరారు. సమావేశంలో సంస్థ గౌరవాధ్యక్షుడు చెన్నుపాటి కృష్ణారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సనిశెట్టి సాంబశివరావు, తన్నీరు దానరావు, బండి శ్రీకాంత్, మురుగు సూరినారాయణ, తన్నీరు రమణ, తోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.